విజయవంతమైన బీఆర్ఎస్ ప్రగతి సభ

- అశేషంగా తరలివచ్చిన జనం
- గులాబీ మయమైన కోస్గి, మక్తల్ పట్టణాలు
- కార్యకర్తల్లో ఉత్సాహం నింపిన మంత్రి హరీశ్‌రావు ప్రసంగం

కోస్గిలో మంత్రి సభకు హాజరైన మహిళలు

కోస్గి /మక్తల్, అక్టోబర్ 4 : పేట జిల్లాలోని కోస్గి, మక్తల్ పట్టణాల్లో బుధవారం నిర్వహించిన బీఆర్ఎస్ ప్రగతి సభ విజయవంతమైంది. ఆయా పట్టణాల్లో ఎమ్మెల్యేలు పట్నం నరేందర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలకు ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు ముఖ్య అతిథిగా హాజరై వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం నిర్వహించిన నియోజకవర్గ ప్రగతి సభలకు ఆయా నియోజకవర్గాల్లోని పల్లె వల్లె నుంచి బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీలు నిర్వహిస్తూ, డప్పు, డోలు మేళాలతో, మహిళలు బతకమ్మలతో సభా ప్రాంగణానికి చేరుకున్నారు.

కోస్గి దవాఖానలో ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలిస్తున్న మంత్రి



ఉదయం 11:10కి హెలికాప్టర్ ద్వారా కొస్గి పట్టణానికి చేరుకున్న మంత్రులు హరీశ్‌రావు, పట్నం మహేందర్‌రెడ్డి, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్‌కు ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్ పుష్పగుచ్చాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. హెలిప్యాడ్ నుంచి భారీ ర్యాలీగా తరలి వచ్చారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ దవాఖానకు చేరుకొని అక్కడ 50 పడకల భవనాన్ని ప్రారంభించారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి శివాజీ చౌరస్తా వరకు నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహించిన ప్రగతి నివేదిక సభలో పాల్గొని ప్రసంగించారు. అనంతరం అక్కడి నుంచి మక్తల్‌కు వెళ్లారు.

మధ్యాహ్నం 1:5 గంటలకు మంత్రి హరీశ్‌రావు హెలీకాప్టర్ ద్వారా మక్తల్ పట్టణానికి చేరుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేలు చిట్టెం రాంమోహన్‌రెడ్డి, ఎస్ ఆర్ రెడ్డి, రైతు సమన్వయ సమితి జిల్లా సభ్యురాలు చిట్టెం సుచరితరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ వనజగౌడ్, దఎంపీపీ వనజ, రాష్ట్ర గిడ్డంగుల చైర్‌పర్సన్ రజిని, మాజీ మార్కెట్ చైర్మన్ నర్సింహగౌడ్ తదితరులు మంత్రి హరీశ్‌రావుకు పూల బోకేలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పట్టణ శివారులో భీమా ఎత్తిపోతల పథకం పంపుహౌస్ స్టేజీ-2 వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి హరీశ్‌రావు పాల్గొని ప్రసంగించారు. మంత్రి హరీశ్‌రావు స్పీచ్ పార్టీ శ్రేణులు, కార్యకర్తల్లో కొత్త జోష్ నింపింది. ఆయన మాట్లాడే టంత సేపు అభిమానులు, కార్యకర్తలు ఉత్సాహంగా, కేరింతలు కొట్టుతు ఈలలు వేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ చిట్యాల నిజాం పాషా, అన్ని మండలాల పార్టీ అధ్యక్షులు, అధికారులు పాల్గొన్నారు.

కోస్గి ర్యాలీలో అభివాదం చేస్తున్న మంత్రి హరీశ్‌రావు

మక్తల్‌లో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి

గులాబీ మయమైన కోస్గి

కోస్గి రూరల్, అక్టోబర్ 4 : కోస్గి పట్టణంలో బుధవారం మంత్రి హరీశ్‌రావు పర్యటన సందర్భంగా హెలిప్యాడ్ నుంచి సభాస్థలి వరకు దారి పోడువునా స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన బ్యానర్లు, ప్లెక్సీలతో గులాబీ మయమైంది.

మక్తల్ జనసంద్రం..

మక్తల్ టౌన్, అక్టోబర్4: మక్తల్ ప్రగతిసభకు నియోజకవర్గంలోని బీఆర్ఎస్ కార్యకర్తలు వేలాదిగా తరలిరావడంతో మక్తల్ పట్టణం జనసంద్రంగా మారింది. మంత్రి సభకు నియోజకవర్గం లోని మక్తల్, మాగనూర్, ఊట్కూర్, కృష్ణ, ఆత్మకూర్, అమరచింత, నర్వ మండలాల నుండి డప్పు వాయిద్యాలతో గులాబీ శ్రేణులు సభాస్థలికి భారీసంఖ్యలో తరలిరావడంతో, సభాప్రాంగనమంతా జనంతో కిక్కిరిసి పోయింది.

మక్తల్ ప్రగతి సభ సైడ్‌లైట్స్

- సభలో తెలంగాణ సాంస్కృతిక కళామండలి సభ్యులు సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై పాటలు పాడి సభికులను విశేషంగా ఆకట్టుకున్నారు.
- సభా వేదికపై మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి చేతికి మైనార్టీ నాయకుడు మహమూద్ సాంప్రదాయ రాఖీ కట్టారు.
- కురువ కమ్యూనిటీ సంఘం నాయకులు పూజారి కుర్మయ్య, రంగప్ప ఆధ్వర్యంలో మంత్రిని గొంగడితో సత్కరించి గొర్రె పిల్లను బహూకరించారు.
- హెలీప్యాడ్ నుంచి సభాస్థలి వద్దకు వస్తున్న మంత్రికి యువకులు పోటీపడుతూ కరచాలనం చేశారు. పలువురు సెల్ఫీ దిగారు.
- హెలికాప్టర్ ద్వారా మక్తల్‌కు చేరుకున్న మంత్రి హరీష్‌రావుకు ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, సతీమణి సుచరితలు పుష్పగుచ్చం అందించి స్వాగతం పలికారు.
- గత ఎన్నికలకు ముందు హరీష్‌న్న ఇరిగేషన్ మంత్రిగా ఉన్న సమయంలో ఇదే సభా వేదిక వద్ద భీమా ప్రాజెక్టును ప్రారంభించుకున్నామని, ఈ రోజు ఆరోగ్య శాఖ మంత్రిగా 150 పడకల దవాఖానాకు శంకుస్థాపన చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలపడంతో సభికులు పెద్ద పెట్టున చప్పట్లు కొట్టారు.
- సభలో మంత్రి హరీష్‌రావును ఉద్దేశించి ఎమ్మెల్యే చిట్టెం మాట్లాడుతూ..ఆరడగుల బుల్లెట్టు హరీష్‌న్న అంటూ సంబోధించడంతో కార్యకర్తలు పెద్ద పెట్టున్న కేరింతలు కొట్టారు.
- వ్యవసాయానికి మూడు గంటల కరెంటు సరిపోతుందని రేవంత్‌రెడ్డి చెప్పినట్లు రైతులకు 3 గంటల కరెంటు కావాలా...లేక ఇప్పుడిస్తున్న 24 గంటల కరెంటు కావాలా చేతులు ఎత్తండని మంత్రి పేర్కొనడంతో సభలో ఉన్న వారందరూ 24 గంటల కరెంటు కావాలంటూ చేతులు పైకెత్తారు. 3 గంటల కరెంటుకు చేతులు ఎత్తకపోవడంతో 24 గంటల కరెంటుకు చేతులు ఎత్తిన వారందరూ కారు గుర్తుకు, మా రామన్నకు ఓటేయండని, 3 గంటల వారు కాంగ్రెస్‌కు ఓటేయండని హరీష్‌రావు అనడంతో ప్రజలు ఉత్సాహంగా కరతాళధ్వనులు చేశారు.

– ఊట్కూర్, అక్టోబర్ 4

మక్తల్‌లో మహిళాసమాఖ్య సభ్యులకు చెక్కు అందజేస్తున్న మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు చిట్టెం, రాజేందర్‌రెడ్డి, ఎంపీ మన్నె

మక్తలో సభకు తరలి వస్తున్న మహిళలు

నీటిగోస తట్టుకోలేక ఊరిడిచి వెళ్లిపోయారు

నవాబ్‌పేట, అక్టోబర్ 4: కాంగ్రెస్ పార్టీలో నేను కారూర్ గ్రామానికి సర్పంచ్‌గా ఎన్నికైనప్పుడు తాగునీటి కోసం జనాలు అరిగోస పడేటోళ్లు.. నీరు రాక, వాళ్ల అవస్థలు చూడలేక, నీరు ఇవ్వలేని పరిస్థితుల్లో జిల్లా కేంద్రానికి వెళ్లిపోయిన ఘటనలు కోకొల్లలు ఉన్నాయని ఎంపీపీ అనంతయ్య పేర్కొన్నారు. నవాబ్‌పేట మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. సమావేశంలో తాగునీటి సరఫరా గురించి ఏఈ షమీయుల్లా వివరిస్తుండగా.. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీటీసీ తుల నీరాం నాయక్ స్పందిస్తూ.. కొన్ని ప్రాంతాలకు సరిగ్గా నీరు రావడం లేదని చెప్పినప్పుడు ఎంపీపీ సైతం ఇదేవిధంగా స్పందించారు. కేసీఆర్ చలువతో ప్రతీ గ్రామంలో స్వచ్ఛమైన భగీరథ నీరు అందుతోందని, సర్పంచులు, ప్రజలు గ్రామాల్లో హాయిగా ఉంటున్నారని చెప్పారు. అనంతరం వ్యవసాయ, ట్రాన్స్‌కో, పంచాయతీరాజ్, ఐసీడీఎస్, ఐకేపీ, విద్య, వైద్యం, పశుసంవర్ధక శాఖల పనితీరుపై సభలో చర్చించారు.కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీలత, ఏవో కృష్ణకిశోర్, సీడీపీఓ శాంతిరేఖ, అధికారులు పాల్గొన్నారు.

పండుగలు సంతోషంగా నిర్వహించుకోవాలి

కోయిలకొండ, అక్టోబర్ 4: గ్రామాల్లో మహిళలు పండుగలను సంతోషంగా జరుపుకోవాలని ఎంపీపీ శశికళా తెలిపారు. బుధవారం మండలంలోని లింగుపల్లి, తిర్మలంపల్లి, చంద్రాసుపల్లి, అనంతాపూర్, నల్లవెల్లి, కనాయపల్లి తదితర గ్రామాలో బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మహిళలకు చీరల పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ విజయభాస్కర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచులు గోపాల్, సత్యమ్మ, ఆంజనేయులు, మహేశ్, అనిత, వైస్ ఎంపీపీ కృష్ణయ్య, ఎంపీటీసీ నిరుపమరాణి, ఏపీఎం విజయకుమారి, నాయకులు భీంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, ఐకేపీ సీసీలు మల్లేశ్, కేశవులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

మిడ్జిల్, అక్టోబర్ 4 : ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలం లోని బోయిన్‌పల్లిలో చోటుచేసుకున్నది. గ్రామస్తుల కథనం ప్రకారం.. బోయిన్‌పల్లికి చెందిన గణేశ్(36) తన ఇంట్లో బుధవారం తెల్లవారుజామున ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. చనిపోయేముందు జడ్చర్లలో ఉన్న అన్న బాలకిషన్‌కు ఈ విషయాన్ని ఫోన్ చేసి తెలిపాడు. బాలకిషన్ గ్రామస్తులకు విషయం తెలుపుగా, వారు వెళ్లి చూసే సరికే గణేశ్ మృతి చెందినట్లు తెలిపారు. ఈ విషయాన్ని గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. కాగా, రెండేండ్ల కిందట గణేష్ తన భార్యను హత్య మార్చిన కేసులో జైలుకు వెళ్లి వచ్చాడు. అప్పటి నుంచి ఇంట్లో ఒంటరిగా ఉండేవాడని గ్రామస్తులు తెలిపారు. మృతుడి అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివనాగేశ్వర్ తెలిపారు.

ఆర్థికంగా ఎదిగేందుకే గొర్రెల పంపిణీ

నవాబ్‌పేట, అక్టోబర్4: గొల్లకురుమలు ఆర్థిక పరిపుష్టి సాధించేందుకే ప్రభుత్వం సబ్సిడీ గొర్రెలు పంపిణీ చేయడం జరుగుతోందని జెడ్పీటీసీ ముత్యాల రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. నవాబ్‌పేట మండల కేంద్రంలో బుధవారం గొల్ల కురుమలకు సబ్సిడీ గొర్రెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే పథకాన్ని గొల్ల కురుమలు అందిపుచ్చుకొని ఆర్థికంగా ఎదగాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ అనంతయ్య, సింగిల్‌విండో చైర్మన్ మాడెమోని నర్సింహులు, సర్పంచ్ గోపాల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.